# శ్రీ రమణ జ్యోతి

సంపుటి-45 సంచిక - 11 హైదరాబాదు నవంబర్, 2025 పేజీలు - 52 రూ. 10/- సంవత్సర చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 45 Issue - 11 Hyderabad November, 2025 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



BHAGAVAN SRI RAMANA MAHARSHI



ARUNACHALA HILL (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామృ తజలధి యరుణాచ లమిది ॥

శ్రీ రమణ జ్యోతి

నవంబర్ 2025

ఈ సంచికలో ...

# Sri Ramana Jyothi

November 2025

IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ కే.యస్. గారి 135వ ప్రవచనం | రామదాస్ మూర్తి | 3 |
| 2 | పి.వి. కరంచందాని | సరోజా ప్రసాద్ | 9 |
| 3. | స్వామి దేశికానంద | రవికృష్ణ శర్మ | 15 |
| 4. | భగవాన్ భక్తులు - గోవులు | రమేష్ బాబు | 24 |
| 5. | అనుస్మరణీయులు శ్రీ పిమ్మరాజు రామ సుబ్బారావు | | 28 |
| 6. | Ask Not, For He Knows Best | Dr K Subrahmanian | 30 |
| 7. | Ashtavakra Gita 42 | V Krithivasan | 37 |
| 8. | Keerai Patti | | 41 |
| 9. | Self-Realization | Ramanananda Swarnagiri | 49 |


## Events in Sri Ramana Kendram in November 2025

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 10th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేసి తెలియజేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్
(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)

# మనసులో నిత్యమూ సంగ్రామమే

డా॥ కే.యస్. గారి 135వ ప్రవచనం

అనువాదం: రామదాస్ మూర్తి

మీరు ఏదైనా వేరొక ప్రదేశానికి వెళ్దామని అనుకున్నారని అనుకోండి. ఆశ్చర్యకరమైనదేమిటంటే, ఆ క్షణం నుండి మానసికంగా, మీరు ఆ ప్రదేశంలో ఉన్నట్లు భావిస్తారు. టికెట్ కొంటారు. అక్కడికి చేరే రోజు వరకు ప్రతి రోజు దానిని గురించి ఆలోచిస్తారు, మాట్లాడుకుంటారు. భౌతికంగా ఇక్కడే ఉన్నప్పటికీ, మానసికంగా మీరు అక్కడే ఉన్నట్లు అనిపిస్తుంది. అంటే, మీ శరీరం ఇక్కడే ఉన్నప్పటికీ, ఆలోచనలు ఎప్పుడో అక్కడికి చేరుకొంటాయి. అలా మానసికంగా మనం ప్రతి రోజూ ఎక్కడెక్కడికో వెళ్లినట్లు భావిస్తాము.

కూర్చున్న చోటినుండియే మీరు రేడియోలో కలకత్తా, ఢిల్లీ, చెన్నైల నుండి ప్రసారమయ్యే సంగీత పరమైన లేదా ఇతర కార్యక్రమాలను వింటుంటారు. మొదట్లో ఇది ఆశ్చర్యకరమైనదిగా అనిపించినప్పటికీ, మీరు కదలకుండా అలా చేయగలుగుతారు. అయితే బాగా పని చేసే రేడియో మీ దగ్గర ఉన్నప్పుడే అలా వినగలరు. ఆ స్టేషనుకు మీ రేడియోను సరిగా ట్యూన్ చేసి, శబ్ద తరంగాలతో అనుసంధానం చేసినప్పుడే మీకు అక్కడి కార్యక్రమాలను వినడానికి వీలవుతుంది. గాలిలో ఏమీ లేనట్లు అనిపిస్తుంది. కాని, దాని ద్వారా శబ్ద తరంగాలు ప్రసరించడం కారణంగానే ఈ మొత్తం ప్రక్రియ జరుగుతుంది.

భగవంతుడు ప్రతిచోటా ఉన్నాడు, కానీ మనం చూడలేము. అలాగని భగవంతుడు లేడని అనలేము. ఎలాగైతే మనం గాలిలోని శబ్ద తరంగాలను చూడలేమో అలాగ అన్నమాట. అదేమిటి, నిశ్శబ్దం ద్వారా భగవంతుడు మనతో సంపర్కం చేసి సమాచారం పంపుతాన్నాడా అంటే, అదే నిశ్శబ్దం మీలోనూ ఉంటుంది.

## నిశ్శబ్దంలో వినడం

భగవంతుడిని ఒక వ్యక్తిగా భావిస్తే, ఆయన చెప్పేది మనం వినాలనుకుంటాం. కానీ మనం అలాగ నిశ్శబ్దం ద్వారా వినగలగాలంటే, మనసు అనే రేడియో తగినదిగా ఉండి ఆ స్టేషన్, అంటే భగవంతునికి సరిగా మనసును ట్యూన్ చేయగలిగి ఉండాలి. దాని భావం, మనసు భగవంతుని వైపు, భగవంతుని గురించిన విషయాలలో ఉంటేనే, ఆయన ప్రసారం చేసే విషయాలను మౌనం ద్వారా కూడా వినగలుగుతాం.

అనేకంగా ఉన్న నక్షత్రాలను అన్నింటినీ కేవలం మన దృష్టితో మాత్రమే చూడలేము. మరీ దూరంగా, చిన్నవిగా ఉన్న నక్షత్రాలను చూసేందుకు మనకు టెలిస్కోప్ అవసరమౌతుంది. పూజ, జపం, లేదా ధ్యానం రూపంలో చేస్తున్న సాధన, మనకు టెలిస్కోప్ ద్వారా లభించే దృక్శక్తిని కలుగజేస్తుంది. అంటే, ఇతరులు చూడలేనిది మనం చూడగలుగుతామన్న మాట. అలాగే, ఇతరులకు లభించని అనుభవం మనకు ప్రత్యేకంగా కలుగుతుంది. మీకు గుడికి వెళ్ళాలన్న ఆలోచన వచ్చినప్పటినుండి, మీ ఆలోచనల్లో ఆ

విషయమే ఉంటుంది. గుడికి వెళ్ళే దారిలో ప్రయాణించే సమయమంతా, మంచి ఆలోచనలు, పవిత్రమైన ఆలోచనలే వస్తాయి. గుడిని చేరేసరికి అవి మరింత ధృఢపడతాయి. అంటే, దైవాన్ని గురించిన ఆలోచన గుడి చేరిన తరువాత కలుగుతుందని అనడానికి లేదు. అసలు భగవంతుని పిలుపు వల్లనే మనం దేవాలయానికి వెళ్లగలం. అందుకే, భగవంతుని గురించి ఆలోచించడానికి కూడా ఆ భగవంతుని కృప ఉండాలని అంటారు.

ఆధ్యాత్మిక మార్గం ఎంతో కఠినమైనది. అది కత్తి అంచు మీద నడిచేదానితో సమానమని ఉపనిషత్తులు చెబుతున్నాయి. సులభం కాదు. క్షణక్షణమూ, జాగ్రత్తగా ఉండాలి. దైవ కృప ఉంటేనే తప్ప గమ్యం చేరలేము. అన్నిటికంటే ముఖ్యంగా అవసరమైనది నమ్రత. మనం ఏదో కొన్ని విషయాలను గొప్ప విషయాలుగా భావించరాదు. ఆధ్యాత్మికత గల మనిషి సహజంగానే నమ్రత కలిగి ఉంటాడు.

**గురు బోధ**

నిజమైన గురువు ఎంతో నమ్రత కలిగి ఉంటాడు. మిమ్మల్ని ఒక చిన్న బిడ్డ లాగా చూస్తూ, ఎంతో ఆప్యాయంగా ఉంటాడు. తన ప్రతాపాన్ని చూపడు. తానూ ఒక బిడ్డలాగ ప్రవర్తిస్తాడు. అర్జునుడు శ్రీ కృష్ణునితో ఎంతో చనువుగా ప్రవర్తించేవాడు. శ్రీకృష్ణుని తన అతి సన్నిహిత స్నేహితునిలా భావించేవాడు. అప్పుడప్పుడు శ్రీకృష్ణుని ఒడిలో తల ఉంచి నిద్రించేవాడు. చూసినవాళ్లు కోపంతో శ్రీకృష్ణుడు ఎవరనుకొంటున్నావు? ఈ విశ్వానికి ప్రభువు అని

మందలించేవారు. క్షమాపణ చెప్పుకున్న అర్జుననితో కృష్ణుడు మాత్రం క్షమాపణ చెప్పడమేమిటి? మనం స్నేహితులం, నీవు మర్యాద చూపనక్కరలేదని అనేవాడట.

జీవితంలో, అందులో ఎదుర్కొనవలసి వచ్చే సమస్యలను గురించి, కర్మయోగ, జ్ఞానయోగాలను గురించి శ్రీకృష్ణుడు చెప్పినప్పుడు అర్జునుడు ఆశ్చర్యపోయేవాడు. అతని ప్రశ్నలకు శ్రీకృష్ణుడు అద్భుతంగా సమాధానాలు ఇచ్చేవాడు. తన గురించి చెబుతూ, తాను ఆదిమధ్యాంతాలు లేనివాడనని అర్జుననితో అన్నాడు. నీరు, నిప్పు .... తనను అంతమొందించలేవని, తాను సర్వవ్యాప్తుడినని, తనకు జననమరణాలు లేవనీ అన్నాడు.

అర్జునుడు శ్రీకృష్ణుని వర్ణనను ఊహించుకొని, తనకు విశ్వరూప సందర్శనం ప్రసాదించమని ప్రార్థించాడు. దానిని శ్రీకృష్ణుడు అనుగ్రహించినపుడు, ఆ విరాట్ స్వరూపంలో, ఆయన ఉదరంలో మొత్తం విశ్వం ప్రత్యక్షంగా అగుపడింది. భయభ్రాంతులకు గురి అయిన అర్జునుడు కృష్ణుని తన యథా రూపంలో తిరిగి తనకు కనబడమన్నాడు. విలపిస్తూ, అర్జునుడు క్షమాపణ కోరాడు.

కృష్ణుడిని మామూలు స్నేహితుడనుకొని తాను ఎన్నో అపచారాలు చేశానని, కఠోరమైన మాటలతో దూషించానని, ఆయన గొప్పతనాన్ని గుర్తించలేక పోయానని అన్నాడు. ఆయనే ప్రభువని కీర్తించాడు.

## గోపికల హృదయం

మహానుభావులు ఎప్పుడూ తమ గొప్పతనాన్ని తాముగా బయట పెట్టుకోరు. సామాన్యులు తాము ఇతరుల కంటే మెరుగైన వారమని ప్రదర్శించుకొంటారు. ఒక విషయాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. నిజంగా గురువైనవారు ఎంతో సాదా సీదాగా ఉంటారు. భగవాన్ ఎప్పుడూ తాము కూడా ఒక చిన్న బాలుడైనట్లు కనబడుతూ, చిన్నపిల్లలతో ఆడుతూ, పాడుతూ చనువుగా ఉండేవారు. గోప గోపికలతో శ్రీకృష్ణుడు కూడా అలాగే ప్రవర్తించేవాడు. తనకు హృదయాలను సమర్పించుకొన్నవారికి ఇక ఏ వేదాంతం బోధించేవాడు కాదు. భౌతికంగా, వాళ్ళు దూరంగా ఉన్నప్పటికీ, వాళ్ళ హృదయాల నిండుగా తాను ఉండేవాడు.

శ్రీ మద్భగవద్గీత రూపంలో శ్రీకృష్ణుడు అర్జునునికి ప్రముఖ సందేశం ఇచ్చాడు:

**సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**

**అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥**

హృదయాన్ని భగవంతునకు సమర్పించిన భక్తునికి సంబంధించిన ప్రతి విషయాన్ని, ఆయనే చూసుకొంటాడు. సాధారణంగా, మనం చేయవలసిన విధులను సరిగా నిర్వర్తించాలి కానీ, ఒక దశలో భగవంతుని గురించిన తలుపు ఒక్కటే ముఖ్యం అవుతుంది. అప్పుడు శరణు జొచ్చినవారి యోగక్షేమాలు తన భారమని ఆయన చెప్పాడు.

గురూపదేశం కురుక్షేత్ర యుద్ధ సమయంలో జరుగుతుంది. ఆ యుద్ధం మంచి తలపులకూ, చెడు తలపులకు మధ్య సంగ్రామం. నిజానికి, అది ఎక్కడో బయట జరిగినది కాదు. నిరంతరమూ, మనలో జరుగుతున్నది. మంచి,చెడు ఆలోచనల మధ్య, స్వార్థ, నిస్వార్థాల మధ్య సాగుతున్న స్పర్థ.

సాధారణంగా, మన గృహాలలో శుభ లేదా అశుభ కార్యక్రమాలలో ఓం శాంతిః శాంతిః శాంతిః అని అంటుంటారు. శాంతి అనేది గుణాత్మక సూచిక. భగవంతుని స్మరణలతో శాంతి లభిస్తుంది. సద్భావాలు గల వారితో సాంగత్యం చేస్తే, దైవకృప కూడా తోడై శాంతియుతంగా ఉంటాం. అందుకే భగవాన్ గురించిన సత్సాంగాల అవసరం ఎంతైనా ఉన్నది.

******

# భగవాన్ నా జీవితంలోకి ఎలా వచ్చారు?

## డా॥ లెఫ్టినెంట్ కల్నల్ పి.వి. కరంచందాని

శ్రీ రమణాశ్రమ ప్రచురణ Fragrant Petals లోని వ్యాసానికి స్వేచ్ఛానువాదం

సరోజా ప్రసాద్

సాధారణంగా నేను పడుకున్న వెంటనే నిద్రలోకి జారుకుంటాను. 1949 ఫిబ్రవరిలో వెల్లూరులో ఉండగా ఒక రాత్రి ఎందుకోగాని ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టలేదు.

అర్ధరాత్రి దాటాక ఒంటిగంట ప్రాంతంలో తిరువణ్ణామలై నుండి ఫోన్ వచ్చింది. భగవాన్ రమణులు అస్వస్థులుగా ఉన్నారని, ఉదయం ఎనిమిది గంటల కల్లా ఆశ్రమానికి రావాలని వర్తమానం. ఈ కబురు వచ్చిందో లేదో గాఢ నిద్ర పట్టింది.

ఆ రోజులలో నేను ఉత్తర ఆర్కాటు జిల్లా వైద్యాధికారిని. తిరువణ్ణామలై ఉన్నది ఈ జిల్లాలోనే. ఎటువంటి ఉద్వేగము లేకుండానే తిరువణ్ణామలై వెళ్లాను. నా ఆలోచనల్లా ఒక్కటే - అస్వస్థుడుగా ఉన్న రోగికి చికిత్స చేయడం మాత్రమే. భగవాన్ రమణులొక గొప్ప మహాత్ములు అన్నది నాకు ముఖ్యం కాదు.

వారిని పరీక్షించాను. చేతి పై భాగంలో ప్రధాన నరం మీద కేన్సర్ వ్యాధి సోకింది. వాడవలసిన మందులేవో చెప్పి, అదే రోజు వెల్లూరుకు తిరిగి వచ్చాను. వైద్యుడు రోగిని ఏ విధంగా పరీక్షిస్తాడో అదే విధంగా పరీక్ష చేశానే గాని ఎటువంటి ఆధ్యాత్మిక భావనలు పెట్టుకోలేదు. భగవాన్ కూడా నాతో మాట్లాడలేదు. ఒకే ఒకసారి

నావంక కరుణాపూరితంగా చూశారు. ఆ చూపు నా మనసును విచలితం చేసింది. నా ముందేదో ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరిసిన భావన కలిగింది.

భగవాన్ నా వంక చూసిన చూపు నన్ను ఆనంద పారవశ్యంలో ముంచెత్తింది. వెల్లూరు తిరిగి వచ్చాక కూడా రమణుల ఆకర్షణలో నించి బయటపడలేకపోయాను. కేవలం వారి దర్శనం కోసమే కొద్ది రోజుల్లో మళ్ళీ తిరువణ్ణామలైకి వెళ్లాను. ఈసారి నా భార్యను కూడా వెంట తీసుకువెళ్ళాను.

ఎంతో ఉత్సుకతతో భగవాన్ వద్దకు చేరి, నమస్కరించి, వారి పాదాల చెంత కూర్చున్నాము. ఒక్క మాట కూడా మాట్లాడలేదు. వారూ అంతే, ఏ సంభాషణా అవసరం లేదనిపించింది. భగవాన్ ఆధ్యాత్మిక తేజస్సు మమ్మల్ని ఆవరించి మనస్సులో ఏదో తెలియని ప్రశాంతత నిండిపోయింది. ఒక దివ్య పారవశ్యంలో మునిగి పోయాము.

భగవాన్ చేతిపై లేచిన వ్రణం దుర్భరమైన బాధ పెడుతుండ వచ్చు. ఎంత గట్టి మనిషైనా అంతటి బాధ తట్టుకోలేక అల్లాడి పోవలసిందే. కాని భగవాన్ వదనం చిరునవ్వుతో, ప్రశాంతంగా, తేజోమయంగా ప్రకాశిస్తూ ఉన్నది.

ఇంతలో భక్తుడొకరు భగవాన్ చేత వ్రణంపై కట్టిన పలుచటి కట్టును తాకాడు. భగవాన్ ఉలిక్కిపడ్డారు. దానితో ఆ భక్తుడు కళవళపడి ‘‘భగవాన్, మీకు నొప్పి కలిగించానా? పొరబాటున ఆ కట్టు అంచుకు నా చేతి తగిలింది’’ అని గొణిగాడు. భగవాన్

దయగా చిరునవ్వు నవ్వి, "ఆ కట్టు అంచున తాకింది అన్నావు. ఆ అంచు కొండంత పెనుభారం అని నీకు తెలియదు" అన్నారు.

వారు యథాలాపంగా ఆ మాట అన్నప్పటికీ ఎంత బాధ భరిస్తున్నారో చెప్పకనే చెప్పారు. అయినా వారి ప్రశాంతవదనంలో ఆ దుర్భర వేదన లేశమాత్రంగా కూడా అగుపించలేదు. ఆ ప్రసన్న వదనంలో కేవలం శాంతి, ఆనందం మాత్రమే గోచరమైనాయి. వారి మనస్సు శరీర భావన నుండి విడివడి ఏదో దివ్యావరణలో ఉన్నదని అనిపించింది.

మరుసటి పర్యాయం భగవాన్‌కు మూత్రం నిలిచిపోయి నప్పుడు నన్ను పిలిపించారు. ఈసారి రోగికి చికిత్స అందించేందుకు వెళ్తున్న జిల్లా వైద్యాధికారి దర్పంతో కాకుండా ఆధ్యాత్మికంగా మహోన్నత స్థాయికి చెందిన మహర్షికి సేవలందించాలన్న వినయం తోనే వెళ్లాను. ఒక శిష్యుడిగా భక్తిభావంతో వారికి చికిత్స చేశాను.

ఆశ్రమానికి చేరేసరికి, గడచిన ఇరవై నాలుగు గంటలుగా ఎంత బ్రతిమిలాడినా భగవాన్ ఎలాంటి ఆహారం తీసుకోలేదని, చుక్క నీరు కూడా త్రాగలేదని చెప్పారు. అందరూ ఆందోళనగా ఉన్నారు. మీరేమైనా వారికి నచ్చజెప్పి ఏదైనా తినేలా చూడండని నన్ను కోరారు. భగవాన్‌ను పరీక్షించాక, వారు ఏదో ఒకటి తినడం అత్యవసరమని తేలింది. నా అభ్యర్థనను కూడా వారు కాదంటే ఏమిటి చేయడం? ఒక వైద్యుడిగా వారిని ఆదేశించడమనే ప్రశ్నే లేదు. నేను చేయగలిగిందల్లా నా ప్రార్థనకు సమ్మతించి నన్ను కృతార్థుడిని చేయవలసిందిగా కోరడమే. మనస్సులోనే ప్రార్థించి,

ఒక గ్లాసు మజ్జిగ ఇచ్చే ప్రయత్నం చేశాను. వారు ఒక్క క్షణం నా వంక తదేకంగా చూసి, వణుకుతున్న చేతులతో ఆ గ్లాస్ అందుకొని మజ్జిగ త్రాగారు. నా ఆనందానికి అవధి లేదు! అందరికీ ఎంతో ఊరట, సంతోషం కలిగాయి. అందరూ నాకు కృతజ్ఞతలు చెప్పారు. కాని భగవాన్ నాపట్ల చూపిన అనుగ్రహానికి నా హృదయం కృతజ్ఞతతో నిండింది. వారు నా మౌన ప్రార్థన ఆలకించి నన్ను కరుణించారు. భగవాన్ దివ్య సన్నిధిలో నేను అనుభవించిన ఉల్లాసం నిజంగా అనిర్వచనీయం.

ఆ తర్వాతి పర్యాయం వారిని చూసేందుకు అర్ధరాత్రి నన్ను పిలిపించారు. వారి గదిలో ప్రవేశించేసరికి అక్కడ నలుగురు భక్తులున్నారు. భగవాన్ వారితో తమిళంలో ఏదో చెబుతున్నారు. గదిలోనుండి బయటకి వెళ్ళమని భగవాన్ చెప్తున్నారని, కాని భగవాన్ ఏదో సంధిలో ఉన్నట్లు మాట్లాడుతున్నందున తాము అక్కడే ఉంటామని చెప్పారు వారు. నేను వారికి నచ్చజెప్పి బయటకి పంపాను. ముగ్గురు వెళ్ళారు కాని ఒకరు మాత్రం ఉండిపోయారు. అటుపిమ్మట తెల్లవారుఝామున మూడు గంటల ప్రాంతంలో ఆశ్రమానికి రమ్మని కబురు వచ్చింది. బహుశః కేన్సర్ బాధ వారి దేహాన్ని చిత్రవధ చేస్తూ ఉండవచ్చు. అయినా గాఢ నిద్రలో ఉన్నారు. వారు పవళించిన గదిలో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. నేను వారికి నిద్రాభంగం కలిగించదలచుకోలేదు. వారి పాదాల చెంతనే మౌనంగా కూర్చున్నాను. ఉన్నట్లుండి కనులు తెరచి నన్ను

చూశారు. "డి.ఎం.ఓ!" అని మెల్లగా గొణిగారు. వారి స్వరాన్ని బట్టి నా గురించి ఆలోచిస్తున్నారని, నేను వస్తానని ఎదురు చూస్తున్నారని అనిపించింది. నా అదృష్టం గొప్పదనుకున్నాను. మౌనంగానే వారిని ప్రార్థించాను. పారవశ్యంతో నా శరీరం కంపించింది.

నిజానికి ఆ సమయంలో నా పదోన్నతిని గురించిన ఆలోచనలతో మనస్సంతా అలజడిగా ఉన్నది. మద్రాసు రాష్ట్రం మొత్తం మీద అందరిలోకి సీనియర్ వైద్యాధికారిని కనుక మేజర్ జనరల్‌గా ప్రమోషన్ నాకే రావాలి. ఎంత వద్దనుకున్నా ఈ ఆరాటం నన్ను కుదురుగా ఉండనివ్వడం లేదు. "ఎందుకింత ఆందోళన, ఆరాటం? ఈసారి భగవాన్‌ను దర్శించినప్పుడు ఆ పదోన్నతి వచ్చేలా దీవించమని వారిని ప్రార్థించాల"నుకున్నాను.

ఆ తరువాత ఆశ్రమానికి వెళ్ళినప్పుడు, ఏమైనా సరే, భగవాన్‌ను ఈ వరం కోరుకోవాలని పట్టుదలగా వెళ్లాను. అయితే వారిని దర్శించేసరికి నా మనస్సు కరిగిపోయింది. నా పట్టుదల కాస్తా ఇరిగి పోయింది. మనస్సులో ఏదో తెలియని సంతృప్తి నిండిపోయింది. నేను అనుకున్న ప్రార్థనకు బదులు మరో ప్రార్థన మనస్సులో రూపుదాల్చింది. "భగవాన్, ఈ పదోన్నతి కోసం ఆరాటం నుంచి నన్ను బయటపడ వేయండి. ఐహిక వాంఛలేమీ లేవు. నాకు ముక్తి ప్రసాదించండి" అని లోలోపల ప్రార్థించాను. ఈ ప్రార్థన వెంటనే ఫలించిన భావన కలిగింది. భగవాన్ ముందు సభక్తికంగా ప్రణమిల్లాను. వారు కరుణాపూరిత దృక్కులతో నావైపు చూశారు. నా అంతరాంతరాలు ఆనందంతో నిండిపోయాయి.

ఇక నేను భగవాన్‌ను చివరిసారి దర్శించినది వారి నిర్యాణం రోజునే. ఎందుకోగాని ఆ రోజు గడిస్తే వారిక ఈ దేహంలో ఉండరన్న భావన కలిగింది. వెల్లూరు నుండి నా భార్యను తీసుకు వచ్చేవరకు దేహత్యాగం చేయకూడదని మౌనంగా ప్రార్థించాను. వారి కోసం నా భార్య కమలా పళ్ళ రసం తెచ్చింది. అప్పటికే భగవాన్ ఎటువంటి పానీయాలు తీసుకోవడం లేదు. "మీరు స్వీకరించక పోతే నా భార్యకు తీవ్ర ఆశాభంగం కలుగుతుంది భగవాన్" అని మనస్సులోనే ప్రార్థించాను. నా మౌన ప్రార్థన ఆలకించారేమో, భగవాన్ ఆ రసం కావాలని అడిగి తీసుకున్నారు. మా దంపతుల ఆనందం చెప్పజాలము. అది తీసుకున్న కాసేపటికే వారు నిర్యాణం చెందారు. ఆ సన్నివేశం అలౌకికంగా తోచింది.

నేను వారిని కలుసుకున్న ఆ రెండు మాసాల కాలంలోను వారితో ఒక్క మాట కూడా మాట్లాడింది లేదు. కాని, వారు కరుణాపూరితమైన దృక్కులతో నన్ను అనుగ్రహించడం ఎంత అద్భుతం! ఎటువంటి అమూల్య ఆధ్యాత్మిక అనుభవం!

******

# అరుణాచల ఋషితో గడిపిన చిరస్మరణీయమైన దినములు-1
# స్వామి దేశికానంద

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Surpassing Love and Grace **లోని వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

అనువాదకులు: రవికృష్ణ శర్మ

ప్రతి మనిషి జీవిత పరమార్థం, ఆ మనిషి అంతరాత్మ అయిన భగవంతుడిని సాక్షాత్కరింపజేసుకొనడం. ఆ పరమోన్నతమైన ప్రయోజనాన్ని లేదా లక్ష్యాన్ని సాధించడానికి ముఖ్యమైనవి మరియు అవసరమైనవి మూడు విషయాలు; **మనుష్యత్వం** - మనిషిగా పుట్టినప్పుడు మాత్రమే మనము మన ప్రారబ్ధాన్ని తీర్చుకోగలము మరియు సాధన చేయగలము, **ముముక్షుత్వం** - సంసారము నుండి బయట పడాలనే తీవ్రమైన ఇచ్ఛ కలగడం **మహాపురుష సంశ్రయం** - మోహ సాగరాన్ని దాటినటువంటి గురువును ఆశ్రయించడం. ఆ పరమోన్నత లక్ష్యము సాధించడ మనేది మన ఆధ్యాత్మిక సాధనకు అనుగుణంగా, స్వతహాగా ప్రకటితమవుతుంది. దాని ద్వారా ఉన్నతి కలుగుతుంది.

నా పూర్వపుణ్య కర్మము చేత, అనుగ్రహము చేత నేను భగవాన్ శ్రీ రమణుల సన్నిధికి 1927లో చేరుకున్నాను. నేను ఆశ్రమంలో అడుగుపెట్టినప్పుడు మహర్షి కౌపీనం మాత్రమే ధరించి సోఫాలో కూర్చుని అనంతమైన శూన్యములోనికి దృష్టి సారించి చూస్తూ ఉండటాన్ని గమనించాను. వారి పాదాల వద్ద భక్తులందరూ చుట్టూ కూర్చుని ఉన్నారు. ఆ దృశ్యము ఋషుల కాలాన్ని

తలపింపజేస్తున్నదా అన్నట్లు ఉన్నది. వారి సన్నిధిలో కొంతసేపు నిలుచుని ఉన్నాను. ఆ సమయంలో వారు నన్ను సర్వ సామాన్యంగా చూసినట్లు చూశారు. దానితో నేను వారికి నా ప్రణామములు అర్పించుకున్నాను. వారు నన్ను కరుణతో ఎక్కడి నుండి వస్తున్నాను, ఎక్కడ బస చేశాను అనే విషయాలని అడిగి తెలుసుకున్నారు. మరుసటి రోజు ఉదయము ఆశ్రమానికి వెళ్లి మహర్షి ఎదురుగా ధ్యానంలో కూర్చున్నాను. మనస్సు ఎంతో ప్రశాంతంగాను, చంచలత్వం లేకుండా ఉన్నది. మహర్షి యథావిధిగా సోఫాలో కూర్చుని గిరివైపు దృష్టి నిలిపి ఉంచినట్లుగా కనిపించారు.

మరుసటి ఉదయం మరల నేను ఆశ్రమానికి వెళ్లి వారి పాదాల వద్ద కూర్చున్నప్పుడు, వారి సన్నిధిలో నాకు చాలా తేలికగా ఏకాగ్రత కుదురుతున్నట్లు తెలుస్తున్నది. అలానే ఎక్కువ సమయం ఎటువంటి అంతరాయం లేకుండా ధ్యానం చేసుకోగలగడం జరుగుతున్నది. ఇంతకుమునుపు ఇంకెక్కడా ఇలా జరుగలేదు. ఎప్పుడైతే నేను పొందుతున్న ఆనందాన్ని, మహర్షికి తెలియజేశానో, అప్పుడు వారు నన్ను, ధ్యానం చేసే సమయంలో నిద్రపోతున్నారా అని అడిగారు. నేను లేదు అని చెప్పినప్పుడు వారు నవ్వి, నేను ధ్యానం చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. హృదయంలో ఉన్న జ్యోతి మీద దృష్టి నిలిపి ఎప్పుడెప్పుడయితే నా మనస్సు చలిస్తుందో అప్పుడప్పుడు నా ఇష్టదైవానికి పుష్పాన్ని సమర్పిస్తాను. ఇలా చేయమని రామకృష్ణ మఠానికి చెందిన రెండవ అధ్యక్షులైన

స్వామి శివానందజీ మహారాజ్ తెలియజేశారు అని మహర్షితో చెప్పాను. దానికి మహర్షి ఆ విధంగా చేయడం మంచిదేనని నాకు చెప్పి దానినే కొనసాగించమని తెలియజేశారు.

మూడవరోజు మహర్షి ఎదురుగా కూర్చుని చాలాసేపు ధ్యానం చేసిన తరువాత, నేను జీసస్ చిత్రపటాన్ని ఒక చర్చిలో చూశానని, అందులో జీసస్ చుట్టూ విభిన్న జాతులకు చెందిన జంతువులు, ఒకదానితో ఇంకొకటి శాంతి సామరస్యాలతో ఎలా ఉన్నాయో తెలియజేశాను. దానికి వారు, అలా జరగడానికి కారణం సాధువైన వాడు శత్రుత్వాన్ని స్వాధీనంలో ఉంచుకుంటాడు కనుక అలా జరుగుతుంది అని అన్నారు. ఈ ఆశ్రమంలో పాములు కూడా ఎవ్వరినీ ఏమీ చేయవు అని చెప్పి ఒక సాధువు సన్నిధిలో క్రూర స్వభావాలు స్వాధీనంలో ఉండడం వలన సౌభ్రాతృత్వము విలసిల్లు తుందని చెప్పారు. ఆ విధంగా సనాతన ఋషులు, ఏ క్రూర మృగాల చేత బాధింపబడక అరణ్యాలలోను, గుహలలోను జీవించారు అని అన్నారు.

ఆ రోజు సాయంత్రం ఒక సందర్శకుడు మహర్షిని 'ధ్యాన సమయంలో మీకేమైనా భగవత్ దర్శనాలు జరుగుతాయా?' అని అడిగాడు. దానికి భగవాన్ నవ్వుతూ ఆత్మగా ఉండడం మన సహజ స్థితి, దానికి ఎటువంటి రూపము లేదు అని చెప్పి శంకరాచార్యుల వారి శ్లోకాన్ని ఉదహరించారు: "నీవు శరీరానివి కావు, మనస్సువు కావు, బుద్ధివి కావు, వీటన్నింటినీ దాటిన వాడివి, నీవు ఆత్మవు". ఎవరైతే అన్ని కోరికలను త్యజించి మనస్సును ఆత్మలో లీనం

చేస్తారో, అటువంటి వారి మనస్సు తనంతట తానుగా నశిస్తుంది. అప్పుడు వాళ్ళు ధ్యానంలో సంపూర్ణత్వాన్ని సాధిస్తారు. అటువంటి వారి మనస్సు మనస్సు కాదు. మనస్సు ఆత్మలో లీనమైపోవడాన్నే సమాధి అని అంటారు. ఇది మానవుని సహజ స్థితి మరియు పరమోత్కృష్టమైన ఆనందము అని వివరించారు.

మానవుని అత్యుత్తమమైన లక్ష్యము ఏమిటి అంటే 'నేనెవరిని?' అనేది తెలుసుకొని ఆత్మ సాక్షాత్కారం పొందటమే. ఒక మనిషి దానిని తెలుసుకోవాలి అనే ప్రయత్నము కనుక చేయక పోతే ఆ మనిషి జీవితం వ్యర్థమే. అత్యుత్తమమైన ఆత్మానంద స్థితిలో అనుభవించే శాంతి మరియు ఆనందము ఎంతో ప్రియమైనది. అది ఈ ప్రపంచములో అనుభవించే వేటికీ సరితూగదు. ఇది అన్ని జీవుల హృద్ గుహలో సంస్థితమై ఉన్నది. అలా సంస్థితమై ఉన్న దానిని గనుక గుర్తించకపోతే జనన మరణ చక్రంలో పడి తిరుగుతూనే ఉంటాము. తన నిజ స్థితిలో ఉన్నవాడు బాధ, దుఃఖానికి ఆవల ఉంటాడు. అది మనిషిని మరణం లేని వానిగా చేస్తుంది.

నేను చిన్నవాడిగా ఉండటం వలన, ఈ విధమైన ఉపదేశాన్ని అనుసరించడం కష్టంగా తోచి, తిరిగి ఆశ్రమానికి మరుసటి దినము వచ్చినప్పుడు, ఆ ఉపదేశాన్ని గురించి విశదీకరించి చెప్ప వలసినదిగా మహర్షిని కోరాను. అప్పుడు మొదటిసారి మహర్షిని 'భగవాన్' అని సంబోధించడం జరిగినది. అప్పుడు భగవాన్, అవును ఈ మార్గాన్ని అనుసరించడం నిజానికి కష్టమే, పదునైన కత్తి మీద

నడవడం ఎంత కష్టమో అంత కష్టము అని చెప్పి, హృదయ పూర్వకంగా సాధన చేస్తే అది ఫలితాన్ని ఇస్తుంది అని తెలియజేశారు. ''నీవు (అంటే నన్ను) రెండు లేదా మూడు గంటలు ఇప్పుడు ధ్యానం చేయగలుగుతున్నావు అని అంటే అది ఈ జన్మలో చేస్తున్న సాధన వల్ల కాదు, పూర్వ జన్మలలో నీవు చేసిన సాధన ఫలితము'' అని అన్నారు శ్రీ భగవాన్.

ఐదవ రోజున నేను దర్శనానికి వెళ్ళినప్పుడు యుక్త వయస్కు రాలైన ఒక స్త్రీ తన చంటి బిడ్డను ఒళ్లో పెట్టుకుని విపరీతంగా శోకిస్తున్నది. కొంతకాలం క్రితమే తన భర్తను కోల్పోవటం చేత తీవ్రమైన దుఃఖంలో ఉన్నది. భగవాన్ ఆమె వైపు తిరిగి కరుణా పూరిత దృక్కులతో చూస్తూ ''భర్త, భార్య మరియు పిల్లలు అనేది దేహానికి సంబంధించినది. ఇంటికి వెళ్ళు. నీవెవరివో తెలుసుకో. ఏడవ వద్దు, ఇంటికి వెళ్ళు'' అని చెప్పారు. జ్ఞాని పలికే పలుకులకు పరివర్తన కలిగించే శక్తి ఉంటుంది. 'ఇల్లు' అనే పదానికి ఆధ్యాత్మిక సౌధము, ఉత్పత్తి స్థానము అని కూడా అర్థము ఉన్నది. ''ఇంటికి వెళ్లి నీవెవరివో తెలుసుకో'' అన్న భగవాన్ ఆదేశం ఆవిడ హృదయంలో ఏకాగ్రతను కలిగించడంతో పాటు శోక సాగరం నుండి పవిత్రురాలిని చేసి ఉండవచ్చు. ఇంకొక యుక్త వయస్కురాలైన స్త్రీ ఎచ్చమ్మాళ్. ఆమె జీవితము కూడా హృదయ విదారకమైనది. తను కూడా తన కుటుంబ సభ్యులను అందరినీ పూర్తిగా కోల్పోయినది. అటువంటి సమయంలో భగవాన్ మౌనము ఒక్కటే ఆమెలో పరివర్తనను తెచ్చి, దుఃఖ సాగరము నుండి

కోలకునేలా చేసింది. ('రమణ మహర్షి అండ్ ద పాత్ ఆఫ్ సెల్ఫ్ నాలెడ్జ్' అన్న పుస్తకము నుండి సంగ్రహించినది)

మిగిలిన రోజులు యథావిధిగా కొనసాగాయి. భగవాన్ దినచర్య ఏమిటంటే, మధ్యాహ్నం వరకు సోఫాలో కూర్చుని ఎక్కువ సమయము మౌనములో ఉండేవారు. భోజనానంతరము కాసేపు విశ్రాంతి. ప్రతి దినము ఉదయము మరియు సాయంత్రము రెండు సార్లు, వచ్చిన ఉత్తరాలను చూసి అటు తరువాత కొండ మీదకు కొంత దూరం నడకకు వెళ్ళేవారు. ఒకానొక సందర్భంలో భగవాన్ 'మనస్సనేదే లేనప్పుడు, ఇతరము అనేది ఉండనే ఉండదు' అని అన్నారు. ఒకే ఒక్క ప్రశాంతత మరియు ఆనందము అంతటా విస్తరించి ఉన్నది అని చెప్పి వెంటనే ఆ మాటను కూడా సరిచేసుకుంటూ, ఒకే ఒక్కటి విస్తరించి ఉన్నదని కూడా చెప్పలేము, ఎందుకంటే రెండవది అనేది లేదు కనుక అని చెప్పి ఆ సత్ చిత్ ఆనంద స్థితిలో లీనమైపోయారు. ఎల్లవేళలా అదే వారి సహజస్థితి. ఆ స్థితిలోనే ఉండేవారు.

తొమ్మిదవ రోజు, ఎప్పుడైతే ఇక నేను ఆశ్రమాన్ని వీడి వెళ్ళవలసిన సమయం వచ్చిందో, అప్పుడు భగవాన్ ముందు మోకరిల్లి విపరీతంగా ఏడ్చేశాను. అది చూసి భగవాన్ "మీరు ఇక్కడే ఉండవచ్చు, ఎవ్వరూ మిమ్మల్ని వెళ్ళమని చెప్పలేదు" అని అన్నారు. అయినా కాని, మరుసటి దినము నేను భగవాన్ వద్ద సెలవు తీసుకునేటప్పుడు, 'ఇక ముందు కూడా యథావిధిగా ధ్యానాన్ని

కొనసాగించమని, కాలములో అన్నీ సర్దుకుంటాయి' అని భగవాన్ నాతో చెప్పారు.

భగవాన్ అనుగ్రహంతో, నేను ఆకర్షింపబడిన ఆ సాధువు (భగవాన్), అత్యుత్తమమైన ఆత్మ సాక్షాత్కార స్థితిని అనుభూతి చెందడమే కాక, ఇతరులకు కూడా ఆ ప్రశాంతతను మరియు ఆనందానుభూతిని కొన్ని కొన్ని సమయాలలోనైనా అనుభూతి చెందేలా సహాయాన్ని అందిస్తున్నారు. అదే ఇతః పూర్వము, ఇప్పుడు మరియు ఇక ముందు కూడా నా జీవితమనే నౌకకు చుక్కాని. మౌనముతోనే అందరికీ తోడ్పాటునందించే శ్రీ భగవాన్ నిజంగా శాశ్వతమైన ఆధ్యాత్మిక ఆనందానికి, ప్రశాంతతకు ఒక నిత్య నూతన వసంతము వంటివారు.

అయితే ముగించేముందు నేను ఈ విషయాన్ని ప్రస్తావించడం సబబుగా ఉంటుందని భావిస్తూ భగవాన్ రమణులకు దండ ప్రణామములు అర్పిస్తూ, 'కాలము గడుస్తున్న కొద్దీ అంతకంతకూ పెరుగుతూ వస్తూ ఉన్న అనేకమంది సాధకులను ప్రోత్సహిస్తూ ఉంటారు' భగవాన్ అని ఆశిస్తూ

ఓ దక్షిణామూర్తి! నీది ఎంత అనుగ్రహమయ్యా
జీవకోటిని అనుగ్రహించడానికి మానవ రూపాన్ని ధరించి
సత్యం శివం సుందరం అనువానికి
ప్రతిరూపమై ఉన్నటువంటి భగవాన్‌కు
నేను పునః పునః ప్రణమిల్లుతున్నాను.

******

## అధ్యాయము - 5

# భగవాన్ భక్తులు - కోతులు

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Bhagavan Ramana The Friend of all **లోని 5వ అధ్యాయానికి స్వేచ్ఛానువాదం**

(గత సంచికకు కొనసాగింపు) **రమేష్ బాబు**

## 5. నొండిప్పయ్యన్

1916లో భగవాన్ తల్లి అళగమ్మ గారు, ఆమె చిన్న కుమారుడు నాగసుందరం ఇరువురూ విరూపాక్ష గుహలో ఉన్న భగవాన్ రమణుల వారి దగ్గరకు వచ్చి చేరారు.

అళగమ్మ తల్లి రాకతో విరూపాక్ష గుహలో చోటు చాలడం లేదు. పైగా నీటి వసతి సరిగా లేదు. గుహకు ఎగువ భాగంలో విశాలమైన ప్రదేశం ఉన్నది. నిరంతరం ప్రవహించే జలధార, పర్వత ప్రాంతాన్ని సమతలం చేయటంతో ఆశ్రమం నిర్మించారు. ఆశ్రమం చుట్టూ రకరకాల చెట్లు, తోట ఉండడంతో ఆశ్రమం చూడ ముచ్చటగా తయారైంది. కంద స్వామి అనే భక్తుడు ఆశ్రమం నిర్మించడంలో మిక్కిలి శ్రమించాడు. ఆ శ్రమకు గుర్తుగా ఆశ్రమమునకు స్కందాశ్రమం అని పేరు పెట్టారు భగవాన్. భగవాన్ స్కందుని అవతారం కాబట్టి ఆ పేరు చక్కగా సరిపోయింది. విరూపాక్ష గుహ నుండి భగవాన్ తమ అనుచరగణంతో పాటు, వెంట ఉన్న జంతుజాలం కూడా స్కందాశ్రమం చేరింది.

అందులో ఒక కుంటి కోతి ఉన్నది. దాని పేరే నొండి. భగవాన్ విరూపాక్ష గుహలో ఉన్న కాలంలో ఒక కోతుల గుంపు అక్కడ

తిరుగుతూ ఉండేవి. అందులో ఒక యువవానరం అందరికీ తలలో నాలుకలా ఉన్నది. మంచి పేరు తెచ్చుకున్నది. కోతుల రాజుకు ఈ యువ వానరానికి మంచి పేరు రావడం ఇష్టం లేదు. కొన్ని రోజులలో కోతుల రాజుకు అసూయ బాగా పెరిగిపోయింది.

ఒకనాడు ఒక పెద్ద చెట్టు చిటారు కొమ్మన ఉన్నప్పుడు కోతి రాజు యువవానరాన్ని పై కొమ్మ మీద నుండి క్రిందకు పడిపోయేలా తోసింది. అంత ఎత్తు నుంచి క్రిందపడడంతో యువవానసరం కాలు విరిగి స్పృహ కోల్పోయింది. కోతుల రాజు మిగిలిన కోతులు ఆ కోతిని దాని ఖర్మకు దాన్ని వదిలి వెళ్ళిపోయాయి. చాలాసేపు తరువాత యువ వానరానికి స్పృహ వచ్చింది. లేవడానికి చేతగాక అది ఎంతో అవస్థపడింది. దాని కన్నుల నుండి కన్నీటి బిందువులు జలజలా రాలాయి. ఏమి చేయాలో తోచక దిక్కులు చూడసాగింది.

దిక్కులేనివారికి దేవుడే దిక్కు అన్నట్లు దానికి విరూపాక్ష గుహ కనబడింది. నిదానంగా దేక్కుంటూ విరూపాక్ష గుహవైపు కదిలింది. భగవాన్ శ్రీరమణ మహర్షి కోతిని చూచి వెంటనే వచ్చి దాన్ని చేతుల లోకి తీసుకున్నారు. కుంటికాలుకు కట్టు వేశారు. దాన్ని సంరక్షించి క్రమంగా కోలుకునేలా చేశారు. అది పూర్తిగా కోలుకుంది. కానీ కాలు మాత్రం కుంటిదయింది. ఆ కుంటి కోతికి భగవాన్ "నొండిప్పయ్యన్" అని పేరు పెట్టి పిలిచేవారు. భగవాన్ ఆహారం తీసుకునే వేళ, నొండి భగవాన్ తొడ మీద కాని ప్రక్కన కాని కూర్చునేది. అది ఎప్పుడూ తినే ఆహారాన్ని వృథా చేసేది కాదు. అది ఎంతో జాగ్రత్తగా శుభ్రంగా తినేది..

భగవాన్ ఎక్కడికి వెళితే అక్కడికి అది కుంటుకుంటూ వెంట వెళ్ళేది. భగవాన్ వద్దని చెప్పినా అది ఎంతో ప్రయత్నంతో ఆయన వెంట నడిచేది. నొండికి భగవాన్ అంటే ఎంతో ప్రేమ. భగవాన్‌ను ఒక యజమానిగా భావించి భక్తునిగా మారిపోయింది. భగవాన్ సంరక్షణలో క్రమంగా నొండి కాలు బాగా కోలుకొన్నది. శక్తి కూడా చేకూరింది. నొండి భగవాన్‌కే కాక ఆశ్రమవాసులందరికీ మంచి స్నేహితుడుగా మారింది. అతని ఆకర్షణీయమైన వ్యక్తిత్వమును అందరూ అభినందించేవారు.

ప్రారంభమైన ప్రతి దానికి ఒక ముగింపు ఉంటుంది. ఆత్మ తప్ప ఏదీ శాశ్వతం కాదు. కొన్ని రోజుల తరువాత నొండికి చెందిన ఆ కోతుల గుంపు విరూపాక్ష గుహకు వచ్చింది. ఆశ్రమవాసులందరూ ఆ కోతులు భగవాన్‌కు అపకారం చేస్తాయని భయపడ్డారు. అమ్మ అళగమ్మ కూడా భయపడి నొండిని వదిలి వేయమని చెప్పింది.

భగవాన్ అందరికీ ఏమీ కాదు అని ధైర్యం చెప్పారు. కోతులు వచ్చి వెళ్ళాయి కాని విరూపాక్ష గుహలో ఎవరికీ ఏ అపకారం చేయలేదు. నొండి తన కోతి గుంపుని చూసి, వెళ్ళి భగవాన్ తొడ మీద కూర్చుంది. ఆ గుంపులోని ఒక కోతి నెమ్మదిగా వచ్చి నొండికి కట్టు కట్టిన కాలుని చూసింది. భగవాన్ ఆ కోతి గుంపు నంతటినీ ఉద్దేశించి కాలు విరగడం వలన మందులు పూసి కాలుకు కట్టు కట్టినట్టు, త్వరలో కోలుకుంటుందని చెప్పారు. కోతులు నొండి కాలుకు అంత తీవ్రమైన దెబ్బతగిలినందుకు క్షమాపణలు చెప్పాయి. ఆ కోతులన్ని ఒక స్నేహపూరితమైన అరుపులు అరచి

నొండిని తమతో కలవమని కోరాయి. నొండి భగవాన్‌ను వదిలి రావడానికి ఇష్టపడలేదు. భగవాన్ వంక చూసింది. "నొండి నీ గుంపు మొత్తం నీ కోసం వచ్చింది, నీవు కావాలని కోరుకుంటున్నారు. మంచి బాలుడు లాగా వారితో వెళ్ళు. నీవు రాజువైన తరువాత మాత్రం మమ్మల్ని మరిచిపోకు" అని చెప్పి వీపు నిమిరి భగవాను నొండిని తన బంధువులతో వెళ్ళమని చెప్పారు. ఇతర జంతువులవలె కోతులు కూడా తమ జాతి వారి యందు ప్రేమను, బంధాలను కలిగి ఉంటాయి. భగవాన్ భక్తులు, కోతులతో భగవానుకున్న సహచర్యానికి ఎంతో ఆశ్చర్యపోయారు.

కోతి జాతికి ఒక నియమం ఉన్నది. మనిషి సంబంధం ఉన్న కోతిని అవి తెగ నుండి బహిష్కరిస్తాయి. కానీ నొండి విషయంలో కోతులు అలా ప్రవర్తించలేదు. అవి భగవానుకు మినహాయింపు నిచ్చాయి. అంతా సుఖాంతం అయినందుకు భగవాన్ ఎంతో సంతోషించారు.

భగవాన్ స్కందాశ్రమానికి మకాం మార్చిన తరువాత నొండి గుంపు తరచుగా వచ్చి భగవాన్‌ను కలిసి వెళ్ళేవి. వాటికి స్కందాశ్రమం సొంత ఇల్లులా ఉండేది. వచ్చినప్పుడల్లా వాటికి వాటి వంతుగా ఆహారం ఇవ్వబడేది. తిన్న తరువాత కోతులన్నీ చెట్లు ఎక్కి గంతులు వేస్తూ భక్తులను గమనిస్తూ ఉండేవి. నొండి మాత్రం భగవాన్ చుట్టూ తిరుగుతూ ఉండేది. అది కూడా ఆశ్రమ వాసులతో ఒకరిగా కలిసిపోయింది.

భోజన సమయంలో అమ్మ అళగమ్మ నొండికి ఒక పళ్ళెంతో వేరుగా ఆహారం అందించేది. అయితే నొండి భగవాన్‌తో కూర్చుని

ఆయన పళ్ళెంలో ఆహారం తినడానికి ఇష్టపడేది. భగవాన్ తన పళ్ళెంలోని ఆహారాన్ని నొండి చేతితో తీసుకుని తింటున్నా ఏమీ పట్టించుకునేవారు కాదు. నొండి భగవాన్ చేతి నుండి ఆహారాన్ని స్వీకరించడం తనకున్న అదనపు హక్కుగా భావించేది. అది ఒక దివ్యమైన అనుబంధం.

ఒకరోజు నొండికి, అతని స్నేహితులకు ఆహారం ఇవ్వబడింది. నొండి తన వంతు ఆహారాన్ని ముట్టుకోలేదు. మిగిలిన కోతులన్నీ తిని వేశాయి. భగవాన్ అప్పుడు వాహ్యాళికి వెళ్ళి తిరిగి వచ్చారు. నొండి ఆహారం తినలేదని భగవాన్‌కు చెప్పారు. భగవాన్‌కి అర్థ మయింది నొండి తన తొడ మీద కూర్చుని తినాలని కోరుకుంది. భగవాన్ సున్నితంగా, నొండి నువ్వు ఇప్పుడు పెద్దవాడివయ్యావు, నీ అంతట నీవు కూర్చొని తినగలవు గదా! అని చెప్పారు. నొండికి అర్థమయ్యింది. భగవాన్ ప్రక్కన కూర్చొని తిన్నది. నొండి, అతని స్నేహితులు కొంత ఆహారాన్ని నేల మీద పారవేశారు. భగవాన్ నొండిని కోప్పడ్డారు. వెంటనే నొండి ప్రతి మెతుకు ఏరింది. భగవాన్ నొండి తెలివికి ఎంతో ఆనందించారు.

దేసూరి అఖిలాండమ్మ భగవాన్ భక్తురాలు. ఆమె తరచుగా ఇంటి నుండి ఆహారం తెచ్చి భగవాన్‌కు పెట్టేవారు. ఒకసారి స్కందాశ్రమంలో ఉన్నప్పుడు అఖిలాండమ్మ భగవాన్‌కు ఆహారం పెట్టారు. అయితే ప్రక్కనే ఉన్న నొండి, భగవాన్ ఆకులోని ఆహారాన్ని లాక్కుంది. అఖిలాండమ్మ రెండవసారి భగవాన్ ఆకులో అన్నం పెట్టగా, తనాకులో తన వంతు తనకు పెట్టకుండా రెండో

సారి భగవాన్‌కు పెట్టినందుకు నొండి గుర్రుమంటూ తన కోపాన్ని వ్యక్తం చేసింది. అఖిలాండమ్మ నొండి అరుపులకు అదిరిపడింది.

భగవాన్ నొండితో 'ఓయ్ ఓయ్ ఆమెను భయపెట్టకు, ఆమె మన సొంత మనిషి అనగానే నొండి ప్రశాంతంగా కూర్చుని తినడం మొదలుపెట్టింది. అఖిలాండమ్మ, భగవాన్ నోటి వెంట మన మనిషి అన్న మాట రావడం తనకు ఎంతో గొప్ప ఆశీస్సుగా భావించింది. నొండి నియమానుసారంగా సుబ్బరంగా తింటాడు. ఒక ఆకులో భోజనం వడ్డిస్తే ఆకులో నుండి ఒక్క మెతుకు కూడా క్రింద పడకుండా తింటాడు. ఒకవేళ పొరపాటున క్రింద పడితే జాగ్రత్తగా దానిని తీసి ఆకులోని ఆహారం తినడానికి ముందే దాన్ని తింటాడు.

నొండి చాలా సున్నితమైన వాడు. అయినప్పటికీ ఒకసారి ఏదో కారణం వలన వాడి ఆకులో ఆహారం బయట పడేశాడు. నేను (భగవాన్) ఎందుకు ఆహారం క్రింద పారేశావు? ఏమిటీపని? అని కోపడ్డాను. వెంటనే వాడు కోపం తెచ్చుకొని నా కంటి పై భాగంలో తగిలేలా కొట్టాడు. దానికి శిక్షగా కొన్ని రోజులు నేను వాడిని దగ్గరకు రానివ్వలేదు. నా తొడ మీద కూర్చోనివ్వలేదు. వాడు ఎంతో ప్రాధేయపడి, పదేపదే బ్రతిమిలాడుకుని చివరకు వాడి సంతోషకరమైన ఆసనం వాడు పొందాడు. ఇది అతని రెండో తప్పిదం. మొదటిసారి అతని చిన్నతనంలో ఒక కప్పులోని వేడిపాలు చల్లార్చడానికి నేను నోటివద్ద పెట్టుకుని ఊదుతున్నాను. వాడు అపార్థం చేసుకుని నా కంటి మీద కొట్టాడు. అది అంత పట్టించు కోవలసింది కాదు. వెంటనే వచ్చి తొడ మీద కూర్చుని, క్షమించు, క్షమించు అన్నట్లుగా బ్రతిమిలాడుకున్నాడు. క్షమింపబడ్డాడు.

(సశేషం)

# అనుస్మరణీయులు - శ్రీ పిమ్మరాజు రామ సుబ్బారావు

(గత సంచిక తరువాయి)

'నాకు ధ్యానం చేయటం లాంటివి పెద్దగా అలవాటు లేదు' అని ఆయన నాతో చెప్పారు. కానీ అదే వ్యక్తి డా. కే.యస్. గారితో పరిచయమైన తరువాత శ్రీ రమణాశ్రమానికి వెళ్ళినప్పుడు గంటల తరబడి మెడిటేషన్ హాలులో కూర్చొని ధ్యానం చేసుకొనేవారు. వారు ఏది మాట్లాడినా చాలా ప్రాక్టికల్‌గా మాట్లాడేవారు. ఇతరులతో మాట్లాడేటప్పుడు ఎంతో నమ్రతతో మాట్లాడేవారు. శ్రీ రమణ భక్తులను వారెప్పుడూ 'ఆకు చాటు పిందెలు' అని అనేవారు.

మా మామయ్యగారికి కొన్ని మధురానుభూతులు ఉన్నాయి. సత్యసాయి బాబాగారిని మొదటిసారి కలసినప్పుడు - "నీకు 15 సంవత్సరాల క్రితం అమృతమిచ్చాను గుర్తుపట్టావా?" అని అడిగారట. 'ఏమిటి గుర్తుపట్టటం?' అని అంటే, పదిహేను ఏళ్ళ క్రితం వీరికి కలలో శిరిడీ సాయి కనిపించి నోట్లో అమృతం పోశారట. అది అద్భుతమైన పరిమళాన్ని వెదజల్లుతోందట. ఇదేమిటి? అని బాబాను అడిగితే 'అమృతం' అని చెప్పారట. ఆ మాటను సత్యసాయిబాబా గారు గుర్తుచేస్తున్నారు. అంటే బాబా గారికి అన్ని విషయాలు తెలుస్తాయి అని మా మామయ్య గారికి అనిపించిందట. 'బాబా గారిని కలవకముందు నేనెలా ఉండే వాడిని? ఇప్పుడెలా ఉన్నది నా జీవితం? ఎవరి వల్ల నాకు ఇవన్నీ వచ్చినయ్యంటారు? కొన్ని వేల సంవత్సరాలనుండి ఒక గదిలో చీకటి ఆవరించి ఉండవచ్చు. కాని ఒక్క అగ్గిపుల్ల వెలిగిస్తే క్షణంలో

ఆ చీకటి వెళ్ళిపోతుంది కదా! భగవంతుని అనుగ్రహం మన మీద ప్రసరించినప్పుడు మన సమస్త పాపాలు పటాపంచలై పోతాయి. అదే భావన నాలో కలిగింది. ఇక నుండి నీ జీవితంలో అమావాస్య లేదు' అని నాతో అన్నారు.

మా మామయ్యగారికి మొదటినుండి పుస్తకాలను చదవటం అంటే చాలా ఇష్టం. అదీకాక ఎక్కడైనా, ఏదైనా తెలుసుకోవలసినది ఉన్నదీ అంటే ఎక్కడికైనా వెళ్ళిపోయేవారు. వారు వెళ్ళటమే కాదు, వారి సన్నిహితులను కూడా ప్రోత్సహించి, వారిలో స్ఫూర్తినింపి మరీ తీసుకొని వెళ్ళేవారు. ఉదాహరణకు అరుణాచలం చూడాలంటే వారు చూడటమే కాక, వారితో పాటు ఎంతో మందిని అరుణాచలం తీసుకొని వెళ్ళారు - నాతో సహా. అక్కడే నేను వారిని గంటల తరబడి ధ్యానం చేసుకోవటం గమనించాను. శ్రీ రమణాశ్రమంలో అన్ని గంటలు ధ్యానంలో ఉండగలుగుతున్నారంటే అది భగవాన్ అనుగ్రహమే. ఈ విషయమే కాదు ఎవరి ద్వారానో వేల్పూరు మౌనస్వామిని గురించి తెలుసుకొన్నారు. ఆ తరువాత వారు ఎన్నో సార్లు ఈ మౌనస్వామిని గురించి నాతో చర్చించేవారు. అందులో భాగంగా 'ఆ స్వామి సాక్షాత్తు రమణ స్వరూపులే' అని అనేవారు. దాంతో నేను 'వారు రమణ స్వరూపులే అని మీకెలా తెలుసు?' అని అడిగాను. దానికి వారు 'ఆయన రమణులేనండి అది నా భావన' అనేవారు. నేనప్పుడు వారితో 'మీకు నిజంగా అలా అనిపించిందా? మరి కే.యస్.గారి గురించి ఏమంటారు?' అని అన్నాను. దానికి వారు - 'నా దృష్టిలో కే.యస్.గారికి, శ్రీ రమణులకు ఎటువంటి తేడా లేదు' అని అన్నారు. . (సశేషం)

# Ask Not, For He Knows Best

Dr K Subrahmanian

Irrespective of who we are, all of us are interested in peace of mind. From the time we get up, till the time we go to bed, the mind is restless. So, what do we do when we are alone? We try to read a book, talk to someone, watch TV, go to a movie or have a drink. We indulge in these activities, day after day in order to escape from ourselves, to forget about ourselves. We do all these things so that we do not have to face ourselves. When we read a book, we get involved in the book; when we talk to somebody, we forget ourselves. However, the satisfaction that we get from these activities is only temporary. The moment we stop reading, we feel bored, and we want to do something else. The mind is constantly seeking something or the other; it is restless. Religion teaches us that *dhyana, japa,* and *puja namasankirtan* are some of the ways to quieten the mind. But we realise that even when we practise these things, the quietness of the mind is only temporary. If you love music, and you listen to the music of your choice, the mind becomes quiet for some time; there is *laya*. The mind merges with the music, and therefore, there is no agitation of the mind so long as you listen to music. But this does not last forever, because the mind is not destroyed; the mind becomes one with music only temporarily.

*layavinashane ubhaya rodhane*

All of us adopt some method or the other to quieten the mind. We understand that the method adopted will

keep the mind quiet only temporarily. Bhagavan says you either surrender totally to the Lord, or you ask yourself who you are. We need to understand ourselves. In order for us to understand ourselves, we don't have to read a number of books. The more we read, the more we argue with others about which method is better. The more we read, the more doubts we have. When *Vaishnavites* read the *Bhagavata*, they say there is no God greater than Vishnu; Shaivites say Shiva is greater than Vishnu. They would then argue that when the milky ocean was churned, what came out first was poison. The whole world would have collapsed had this poison not been swallowed by Shiva. As a counter argument, the Vaishnavites would say that Vishnu wanted people to remember Shiva in connection with something, and therefore, taking pity on Shiva, Vishnu asked Shiva to swallow the poison. Is there any way we can get satisfaction from such arguments? Will they result in peace of mind?

The *Lalitha Sahasranama* lists the thousand names of the goddess. However, almost towards the end, it says,

*naama rupa vivarjita*

This means that the Devi has no name and no form. This is a great paradox because after reciting the thousand names, we also say that she has no name and no form. And what is more,

*abala gopa vidita sarvanulanghya shaasana*

The verse says that the Devi cannot be understood either by a scholar or by those who know the *Veda*s and the *Upanishads*. She can only be understood by innocent

